విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

# అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
శనివారం 22 - 02 - 2025

# లైనింగ్ పనుల మీద ఉన్న శ్రద్ధ పేరూరు డ్యాంకు నీళ్లు రావడంలో లేదు
## మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- లైనింగ్ పనులు ఆపండి, కాకమ్మ కథలు చెప్పకండి
- జరగని పనుల గురించి మాట్లాడొద్దు.
- రైతులు వ్యతిరేకించే పరిస్థితి తెచ్చుకోకండి..!
- మొదట పిల్లకాలువలు పూర్తి చేయండి.
- పేరూరు డ్యాంకు నీళ్లు ఇవ్వండి.మోసపురిత కార్యక్రమాలు చేయొద్దు
- మీ మండలంలో ఉన్న డ్యాంకు నీళ్లు తీసుకురాకపోతే సిగ్గుచేటు..!
- లైనింగ్ పనుల ద్వారా లక్షల ఎకరాలు బీడుగా మారే అవకాశం
- రేపటి నుంచి గ్రామాల్లో పర్యటిస్తాం.
- లైనింగ్ పనులను అడ్డుకునేందుకు రైతులు ముందుకొస్తున్నారు



ఆత్మకూరు, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా లైనింగ్ పనులు చేయడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతుల పంటల పొలాలు లక్షల ఎకరాలు బీడుగా మారే ప్రమాదం పొంచి ఉన్నందున హంద్రీనీవా పరివాహక ప్రాంత రైతులందరూ మేల్కోవాల్సిన టైం వచ్చిందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. పెన్నానదిలో ఇసుకను తోడుకునే విషయంలో ఉన్న ఉత్సాహం పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకురావడంలో పరిటాల సునీత చూపించడం లేదు అని మాజి ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని పార్టీలకు అతీతంగా రైతులు జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న వాహనాలను ఆపుతున్నారు. తగరకుంట,పాతపాళ్యం సర్పంచ్‌లు, కొందరు రైతులు వెళ్లి లైనింగ్ పనులను అడ్డుకున్నారు. వాస్తవాలను ప్రజలముందు ఉంచడంతో మేము సక్సెస్ అయ్యాం. కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేస్తే దాదాపు 20 కిలోమీటర్ల దూరం వరకు భూగర్భ జలాలు తగ్గిపోయి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బోర్లు ఎండిపోతాయి. రైతులు వలసలు వెళ్లే పరిస్థితులు వస్తాయని గతంలో అనేకమార్లు విజ్ఞప్తులు చేశాం. కమ్యూనిస్టు పార్టీల సోదరులూ, రైతు సంఘాలు, రైతు కూలీ నాయకులు, టిడిపి,బిజెపి,జనసేప పార్టిల రైతులు కూడా విజ్ఞప్తి చేస-్తున్నా. పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాడదాం. హంద్రినివా కాలువ కింద ఉన్న గ్రామాలను రేపటి నుంచి సందర్శిస్తాం. అనుమతుల కోసం కోర్టును ఆశ్రయించాం. ఆరు నూరైనా ప్రభుత్వం లైనింగ్ పనులు చేయాల్సిందేనని పట్టుబట్టి మరీ ఒప్పందాలు కూడా చేసుకుంది. జూన్ నాటికి పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. అనంతపురం జిల్లాలోనే దాదాపు 6 లక్షల ఎకరాల వరకు భూగర్భజలాలు పడిపోతాయని చెబుతున్నా అధికారులు, కాంట్రాక్టర్లు ఉత్సాహంగా పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే లకు చిత్తశుద్ధి ఉందా?. శ్రీశైలం డ్యాంలో 80 టిఎంసిల నీళ్లు ఉన్నాయి. రోజూ సగటున ఇరు రాష్ట్రాలు అర టిఎంసి మాత్రమే నీళ్లు డ్రా చేస్తున్నాం. ఈ లెక్కన మరో నాలుగు నెలల వరకు వాడుకోవచ్చు. ఆలోగా మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న చెరువులకు ఇవ్వొచ్చు. పేరూరు డ్యాంకు కూడా ఇవ్వొచ్చు.మేము ప్రెస్‌మీట్ పెడితే మరుసటి రోజే పరిటాల సునీతమ్మ పేరూరు డ్యాం గేట్లు పీకించి రిపేరీ అంటూ ప్రకటనలు ఇచ్చింది. ఈ ఏడాది ఇవ్వడానికి వీలుకాదని చెబుతోంది. ఇంకా ఐదు నెలలు నీళ్లు వచ్చే అవకాశం ఉన్నా.ఆదిశగా ఆలోచన చేయడం లేదు. పెన్నానదిలో ఇసుకను తోడుకునే విషయంలో ఉన్న ఉత్సాహం పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకురావడంలో సునీత చూపించడం లేదు. తన నియోజవకర్గంలో చెరువులకు నీళ్లివ్వాలని అడగాల్సిన పెద్దమనిషి బాలకృష్ణ గారు నియోజకవర్గాన్ని గాలికొదిలేసి తిరుగుతున్నారు. మంత్రి సవితమ్మ పెనుకొండ నియోజకవర్గంలో చెరువులకు నీళ్లు తెచ్చుకునే విషయలో మాట్లాడాలి. ఎంఎస్ రాజుగారూ.మీరు కొత్తగా వచ్చారు. మడకశిర నియోజకవర్గంలో అగలి, అమరాపురం డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసుకోవాలంటే 200 కోట్లు కావాలి. ఆ నిధులు తెచ్చుకుని ఆ కార్యక్రమంపై దృష్టి పెట్టండి. ఆ పనులు ఎప్పుడు చేస్తారని చంద్రబాబును నిలదీయండి. మడకశిర ప్రజలు ఏమి కోరుకుంటున్నారు, మీరేం చేయాలని అనుకున్నారో ప్రజలకు తెలియజేయండి. ఇంకా ఐదు నెలల పాటు శ్రీశైలంలో నీళ్లుంటాయి. ఆ నీళ్లు తెచ్చుకునేలా ఆలోచన చేయమంటే లైనింగ్ పనుల గురించి మాట్లాడుతున్నారు. ఆయకట్టు రైతులకు గుండుసున్న చుట్టి చిత్తూరు జిల్లాకు నీళ్లు తీసుకుపోవాలని చూస్తున్నారు. మా రైతుల నోట్లో దుమ్ము కొట్టి మీరు తీసుకుపోయినా 20 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లిస్తారు. అదే అనంతపురం జిల్లాలో రెండు లక్షల ఎకరాల రైతులు నష్టపోతారు. హంద్రినివా కింద ఉన్న రైతుల హక్కుగా రావాల్సిన నీటికోసం పోరాడుతున్నారు. మీకు ఓట్లు వేసినదానికి రైతుల నోట్లోమట్టి కొడుతున్నారు. లైనింగ్ పనులను అడ్డుకునేందుకు ఎవరు వచ్చినా కలుపుకొని పోరాటాలు చేస్తాం. లైనింగ్ పనులు ఆపేంతవరకు పార్టీలు, కులాలు, మతాలు లేవు. రేపటి నుంచి గ్రామాలు తిరుగుతాం. పెద్దలను కలిసి చర్చిస్తాం. రైతులకు అవగాహన కల్పిస్తాం.అధికారులూ కాకమ్మ కథలు చెప్పొద్దండి. అయ్యే పనులు చేయండి. జరగని పనుల గురించి మాట్లాడొద్దు. చంద్రబాబు యుగో పక్కన పెట్టాలి. రైతులు వ్యతిరేకించే పరిస్థితి తెచ్చుకోవద్దు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా స్పందించాలి. హంద్రినివా ప్రాజెక్ట్‌ను అనంతపురం, కర్నూలు జిల్లాలకే పరిమితం చేయాలి. మైక్రో ఇరిగేషన్ లేదా పిల్లకాలువల నిర్మాణాలు పూర్తయిన తర్వాత లైనింగ్ పనులు చేసుకోండి.సునీతమ్మా. పేరూరు డ్యాంకు నీళ్లు ఇవ్వండి. మోసపు కార్యక్రమాలు చేయొద్దు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకురావాలనే చిత్తశుద్ధి కాని, ఆలోచన కానీ మీకు లేదు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. మీ మండలంలో ఉన్న డ్యాంకు నీళ్లు తీసుకురాకపోతే సిగ్గుచేటు. మేము పైసా ఖర్చు లేకుండా వరుసగా మూడేళ్లు పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చాం. ఇప్పుడా అవకాశం నీకొచ్చింది. నీళ్లిచ్చి ఖ్యాతి తెచ్చుకో.పొరబాటు చేసుకోవద్దు.

---

# రైతులకు కష్టం వస్తే ఆదుకునే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం

- జగన్ రెడ్డిలా షోలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాదు
- టమోటా కొనుగోళ్లపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి హర్షం
- ప్రభుత్వమే రైతుల నుంచి టమోటా కొనుగోలు చేయడం హర్షణీయం
- జిల్లా రైతుల తరుపున సీఎం కి ఎమ్మెల్యే దగ్గుపాటి కృతజ్ఞతలు





అనంతపురం, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

అనంతపురం రైతులకు కష్టం ఉందంటే అన్ని విధాలుగా ఆదుకునే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో టమోటా పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్న తరుణంలో ప్రభుత్వమే పంట కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గారు తీసుకున్న ఈ నిర్ణయం పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో వేలాది మంది రైతులు టమోటా పంట సాగు చేస్తుంటారని ధరలు బాగా ఉన్నప్పుడు ఎంత లాభం వస్తుందో ధరలు లేకపోతే రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతింటారన్నారు. ఈ పరిస్థితులను తాను దశాబ్దకాలంగా చూస్తున్నానని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. గతంలో ప్రభుత్వం మార్కెట్లో ధరలు నియంత్రణ కోసం ప్రయత్నం చేసిన సందర్భాలు చూశామని..కానీ తొలిసారి ప్రభుత్వమే పంటను కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం టమోటా ధరలు పడిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం కిలో 8రూపాయల చొప్పున కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ పంటను రైతు బజార్లకు తరలించి సామాన్యులకు తక్కువ ధరకే విక్రయించేలా ప్రణాళికలు చేసిందన్నారు. అంతే కాకుండా ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు కూడా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని పథకాల ద్వారా టమోటా కొరత ఉన్న ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో విక్రయించడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించినట్టు వివరించారు. దీని వలన రైతులకు కిలో టమోటా సుమారు 10 నుంచి 15 రూపాయల వరకు రైతులకు అందుతోందన్నారు. అంతే కాకుండా టమోటా ప్రాసెసింగ్ యూనిట్లకు కూడా తరలించి రైతులకు గిట్టుబాటు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతుల విషయంలో జగన్ రెడ్డి డ్రామాలు చేసినట్టు మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి రాదని ఆయన ఆలోచన అంతా రైతులకు ఏవిధంగా మేలు చేయాలన్న విధంగానే ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

---

# అర్హులైన బీసీల అందరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలి
## బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యంకు వినతులు



శింగనమల, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

అర్హులైన బీసీల అందరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యంకు ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సి. లింగమయ్య వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీలకు సబ్సిడీ లోన్లు ఇస్తున్నామని ఆర్భాటంగా చెప్పుకుంటున్నారన్నారు. విడుదల చేసిన లోన్లు వందల్లో ఉన్నాయని ఆన్లైన్లో అప్లై చేసిన వారు వేలల్లో ఉన్నారన్నారు. ఇప్పటికే అధికార పార్టీ కనుసనల్లో బీసీ కార్పొరేషన్ నడుస్తుందని ప్రచారం జరుగుతోందన్నారు. నిన్నటి నుండి ప్రారంభమైన ఇంటర్వ్యూ ప్రాంగణాల్లో కూడా అధికార పార్టీ వారు పెత్తనం చేస్తున్నారన్నారు. ఈ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సిన తతంగాన్ని అధికారి పార్టీ నాయకులకు అప్పజెప్పడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా బీసీ కార్పొరేషన్ అధికారుల సమక్షంలో నడపాలని కోరుతున్నామన్నారు. అర్హులైన బి సి అభ్యర్థులకు ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేతి వృత్తిదారుల సమాఖ్య కార్యదర్శి సివిహరి కృష్ణ, జిల్లా అధ్యక్షులు సి నాగప్ప, జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ బద్దలాపురం నరసింహులు నగర అధ్యక్షులు కార్యదర్శి భూషణ, వీరాంజి,నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు గోవిందరాజులు, సహాయ కార్యదర్శి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

---

# భారత రాజ్యాంగము పీఠిక- ప్రాధమిక హక్కులు- ఆదేశిక సూత్రాలు పుస్తకావిష్కరణ



తాడిపత్రి, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

21-02-25 వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా కమిటీ సభ్యులు జిల్లా ప్రెసిడెంట్ ఎ. హెూన్నూరప్ప వైస్ ప్రెసిడెంట్ కోటి గంటి నబి రసూల్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా సూపరిండెడ్ ఆఫ్ పోలీస్ వారి కార్యాలయమునకు వెళ్లి సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు రచించిన ముద్రించిన భారత రాజ్యాంగ పీఠిక ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాల ఆధారంగా ముద్రించిన పుస్తకమును గౌరవనీయులైన అనంతపురం జిల్లా సూపర్ ఇండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ జగదీష్ గారిచే పుస్తకములను ఆవిష్కరించడం జరిగింది గౌరవనీయులైన ఎస్పీ గారిని కలిసిన సందర్భంగా ఎస్పీ గారికి సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నబి ర-సూల్ ట్రెజరర్ ఓబన్న నూతన కమిటీ సభ్యులను అనంతపురం జిల్లా సమాచార హక్కు జిల్లా ఉపాధ్యక్షులు,డా రామలింగమయ్య జాయింట్ సెక్రెటరీ మనోజ్ కుమార్ పాములాయ్ భాను ప్రకాష్ కల్చరల్ సెక్రెటరీ ఎస్ రషీద్ కార్యదర్శి రామాంజనేయులు పరిచయం చేయడం జరిగింది అదేవిధంగా సమాచార హక్కు చట్టం పుస్తకములను అందజేయడం జరిగింది పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ ఎస్పీ గారి ని కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించడం జరిగింది

---

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



అనంతపురం, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

అనంతపురం ఈరోజు అనంతపురం పట్టణంలోని యమ్. పి అనంతపురం క్యాంపు కార్యాలయంలో, సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన ₹5,37,157 చెక్కును బుక్కరాయసముద్రం మండలం, జంతులూరు గ్రామానికి చెందిన దూదేకుల కరింబీ కి అందజేసిన అనంతపురం పార్లమెంట్ సభ్యులు శ్రీ అంబికా లక్ష్మీనారాయణ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన కలకాలం సీఎం గా కొనసాగి మరింత ప్రజాసేవ చేయాలని ఎంపీ అకాంక్షించారు. పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసా అందిస్తోందని, సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, మన ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.

---

# బీటీపీ పనుల కోసం భూసేకరణ రైతులకు అందాల్సిన పరిహారం అందేలా చూడండి...



కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

బి టి పి కాలువ పనుల కోసం ఇంకా సేకరించాల్సిన భూమి ఆగిన పనులు తిరిగి ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ను కోరారు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం సందర్శించిన సందర్భంగా ఎమ్మెల్యేలు కలెక్టర్ ను ఆయా శాఖల అధికారులను కలిసి వీటిని త్వరితగతిన పూర్తి చేయడానికి సంబంధిత శాఖల అధికారులకు సూచించి ముందస్తు జాగ్రత్తలు ప్రణాళికలతో పనులుముందుకు సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కలెక్టర్ ను కోరారు భూములు ఇచ్చిన రైతులకు అందాల్సిన పరిహారం కూడా వీలైనంత త్వరగా ఇచ్చేలా చూడాలని కలెక్టర్ ను కోరారు అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా సంబంధిత శాఖల అధికారులకు సూచించాలని కోరారు ఐందుకు స్పందించిన కలెక్టర్ బీటీపీ పనులు అవసరమైన భూసేకరణ అందాల్సిన పరిహారం ఇచ్చేందుకు తగిన జాగ్రత్తలు తీసుకొని అధికారులకు ఆదేశాలు ఇస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు తెలియజేశారు

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవలో ఐ జి పి మోహన్ రావు - ఆలయ అతిథి మర్యాదలతో సత్కారం



ఉరవకొండ, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

రాష్ట్ర ఐజిపి మోహన్ రావు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవలో తరించారు. దేవస్థాన పూజారులు పూర్ణకుంభంతో మేళ తాళాల మధ్య స్వాగతించారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆయన పేరిట ప్రత్యేక అర్చనలు జరిపించారు. మోహన్ రావు ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. పాదమే దైవంగా శ్రీ లక్ష్మీ నరసింహుడు పూజలు అందుకుంటున్నారని తెలిపారు. పాదం కడిగిన నీరు పెన్నా నది ఒడ్డున కలిసిపోతుందన్నారు. కోర్కెలు ఫలించాలంటే ప్రతి చోట కోర్కెలు తీరిన తర్వాత మొక్కుబడులు చెల్లిస్తారు. అయితే స్వామివారికి మంగళవారం రోజున కోర్కెలు నివేదించి ఆకు పూజలు చేయిస్తే కోర్కెలు ఫలిస్తాయని తెలిపారు.

## అమిద్యాల బీసీ కాలనీలో అంధకారం. - చోద్యం చూస్తున్న గ్రామ కార్యదర్శి




ఉరవకొండ, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

మండల పరిధిలోని అమిద్యాల మేజర్ గ్రామపంచాయతీలోని బీసీ కాలనీలో అంధకారం చోటు చేసుకుంది. వీధి బల్బులు వెలగటం లేదు. ఏడాదిగా చీకట్లో మగ్గుతున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వాడు చూద్దాం చూస్తున్నారంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రిపూట కాలనీలో విషపురుగులు సంచరిస్తుంటాయి. చీకట్లో అనుకోని ప్రమాదం ఏదైనా సంభవిస్తే దానికి పంచాయతీ పాలకవర్గమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తోంది. గ్రామపంచాయతీలో అధికార పార్టీలో ఆధిపత్య పోరు సాగుతోంది. గ్రామస్తులు సమస్యలు దృష్టికి తెస్తే ఒకరిపై మరొకరు బాధ్యత మోపుకుంటూ సమస్యలు గాలికొదిలే-స్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అయోమయ స్థితిలో ప్రజలు,కార్యకర్తలు కొట్టుమిట్టాడుతున్నారు. తెదేపాలో ఎదురులేని మనిషి తిరుగులేని నాయకుడుగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కొనసాగుతున్నారు. అయితే ఆమిద్యాల గ్రామంలో మాత్రం గ్రూపు రాజకీయాలతో సతమతమవుతున్నారు.

## హంద్రీనీవా లైనింగ్ పనులు వెంటనే ఆపండి. పి.సిద్ధరాంపురం రైతు ఎర్రిస్వామి ఆవేదన



ఆత్మకూరు, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం స్థానిక మండల పరిధిలోని వి సిద్ధరాంపురం గ్రామానికి చెందిన ఎర్రి స్వామి హంద్రీనీవాపై ఆధారపడి పంటలు పండించుకుంటున్నామని హంద్రీనీవా లైనింగ్ పనులు చేపడితే పూర్తిగా పంటలకు నీరు అందక నష్టపోయే ప్రమాదం ఉందని వెంటనే లైనింగ్ పనులు ఆపాలని రైతు ఎర్రి స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రినివా స్టేజ్%-%2 కింద లైనింగ్ పనులు పూర్తయితే మా ఒక్క గ్రామంలోనే లక్షలాది చీని చెట్లు ఎండిపోనున్నాయి.ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి వాపోయారు. హంద్రినివా కాలువ లైనింగ్ ప్రారంభమయ్యాయి. స్టేజ్%-%2 కింద మా ఊరి మీద పనులు చేస్తున్నారు. ఈ లైనింగ్ పనులు చేపడితే మా గ్రామంలోనే వేలాది ఎకరాల్లో లక్షల సంఖ్యలో చీని చెట్లు ఎండిపోనున్నాయి. లైనింగ్ పనులు ఆపకపోతే హంద్రీనీవా పరవాహక ప్రాంతాల రైతుల పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు లక్షలాది ఎకరాల బీడుగా మారిపోతాయని వెంటనే లైనింగ్ పనులు ఆపాలని రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి ఆవేదన వ్యక్తం చేశారు.

## సచివాలయ సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావాలి - వజ్రకరూర్ ఎంపిడివో బీవీ రవి ప్రసాద్



ఉరవకొండ, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా సమయపాలన పాటించి హాజరు కావాలని, వజ్రకరూరు ఎంపీడీవో బీవీ రవి ప్రసాద్ చెప్పారు. రాగులపాడు సచివాలయం వద్ద సమాయానికి విధులకు ఉద్యోగులు రాకపోవడంతో ఆయన చాలా సేపు వేచి ఉండి మండిపడ్డారు. సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డిని వివరణ కోరి విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రవి ప్రసాద్ తెలిపారు. వజ్రకరూరు మండలంలో విధులకు సక్రమంగా హాజరు కాకుండా పై అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ పని చేయని కొంతమంది సిబ్బందికి ఎంపీడీవో శుక్రవారం తాకీదులు అందజేశారు. కొంతమంది సమయానికి సరిగా విధులకు హాజరు కావడం లేదని, పై అధికారుల ఆదేశాల మేరకు విధులలో నిర్లక్ష్యం వహిస్తుందన వలన మండలంలో కొందరికి తాఖీదులు శుక్రవారం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు




## శ్రీ సంగమేశ్వర స్వామి హుండీ లెక్కించిన ఎండోమెంట్ అధికారులు




కూడేరు, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలో వెలసినటువంటి పురాతన పుణ్యక్షేత్రం శ్రీ జోడు లింగాల సంగమేశ్వర స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం రోజున నిర్వహించారు. శ్రీ జోడు లింగాల సంగమేశ్వర స్వామి దేవస్థానం నందు హుండీలలో భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకల ను దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి శ్రీ %వీ%. వన్నూర్ప స్వామి పర్యవేక్షణలో హుండీలను లెక్కింపు కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు దేవస్థానం నందు హుండీలను తెరిచి నగదును లెక్కింపు నిర్వహించగా 4,79,664-00 ( నాలుగు లక్షల డెబ్భై తొమ్మిది వేల ఆరు వందల అరవై నాలుగు రూపా-యలు ) ఈ మొత్తం 9 నెలలకు గాను ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ అధికారి రమేష్ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షణలో , ఆలయ కార్యనిర్వహణాధికారి సాకే రమేష్ బాబు ఆధ్వర్యంలో కూడేరు గ్రామ పెద్దలు, బొమ్మయ్య, జయ ప్రకాష్ గౌడ్, బాటా వెంకటేష్ , నారాయణస్వామి సి.సుధాకర్, ఈశ్వరయ్య, బసన్న గౌడ్, ఆలయ అర్చకులు మహేష్ స్వామి, మ ప్రజలు ఆలయ , సిబ్బంది సాయినాథ్ సునీత తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్న వారందరు సాంప్రదాయ దుస్తులు ( దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తెల్ల పంచ , కండువా ) ధరించి హుండీ లెక్కింపు లో పాల్గొన్నారు

## పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలు రద్దు చేయాలి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నిరసన




ఉరవకొండ, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

రాష్ట్రవ్యాప్తంగా పీజీ విద్యార్థులకు సంబంధించిన కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు శివారెడ్డి, వంశి మాట్లాడుతూ! యూనివర్సిటీలలో పీజీ అడ్మిషన్లకు సంబంధించి కామన్ ఎంట్రన్స్ టెస్టు రద్దు చేస్తామని యువగలం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. ఈ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ వల్ల యూనివర్సిటీలలో పీజీ ప్రవేశాలు పూర్తిగా తగ్గిపోయా-యని దీనివల్ల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా పీజీ ఎంట్రన్స్ టెస్టు రద్దుచేసి యూనివర్సిటీలకి అడ్మిషన్లు చేసుకునేలా ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు అని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చక పీజీ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేయకుండా తిరిగి నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారని దీనిపై మీ వైఖరి ఏంటని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చినటువంటి ఈ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ వల్ల రాష్ట్రంలోయూనివర్సిటీలకు పూర్తిగా అడ్మిషన్ తగ్గిపోయాయని డిపార్ట్మెంట్లకు డిపార్ట్మెంట్ లే మూసివేసే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇందులో భాగంగానే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో దాదాపు నాలుగైదు డిపార్ట్మెంట్లో మూతపడ్డాయి అన్నారు. అలా కాకుండా ఇప్పుడు పూర్తిగా పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేసి యూనివర్సిటీలకే అడ్మిషన్లు చేసుకునేలా పూర్తి అధికారాలు అప్పగిస్తే యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న టెస్టుల వల్ల అక్కడున్న లోకల్ విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి విద్యార్థులు పిజి ప్రవేశాలు చేసుకోవడం వల్ల యూనివర్సిటీలో ఆర్థికంగా బలోపేతమయితాయని అన్నారు. కాబట్టి ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు స్పందించి పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీజీ ప్రవేశాలకు సంబంధించి యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లకు పూర్తి అధికారాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోము, సాయి, శ్రీకాంత్, అభిషేక్, అశోక్, ప్రుధ్వి, అజయ్, మహేష్, తిరుమలేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## దగ్గుపాటి ప్రసాద్ చోరువతో పెండింగ్ లో వున్న రోడ్డు పనులు ప్రారంభం




అనంతపురం, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

అనంతపురం గత పది సంవత్సరాలనుండి అనేక కారణాల వల్ల పెండింగ్ లో వున్న అశోక్ నగర్ బ్రిడ్జి నుండి హౌసింగ్ బోర్డు వెళ్లే రోడ్డు వరకు స్థానిక 27 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ స్థానిక నాయకులు ప్రజల విజ్ఞప్తి మేరకు శాసన సభ్యులు దగ్గుపాటి ప్రసాద్ గారి చోరువతో 11 మీటర్లు వెడల్పు తో రోడ్డు పనులు ప్రారంభించిన అధికారులు స్థానిక అశోక్ నగర్ హరిహర నగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ దగ్గుపాటి ప్రసాద్ గారికి కృతజ్ఞతలు తెలియజేసారు ఈ కార్యక్రమం లో జిల్లా అధికారప్రతినిధి సరిపూటి రమణ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్ డివిజన్ అధ్యక్షులు సరిపూటి శ్రీకాంత్ నాయకులు ఎన్ బి కె నారాయణ స్వామి జిల్లా తెలుగుయువత అధికారప్రతినిధి శిరీషాల రాంబాబు కాంట్రాక్టర్ మరియు మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సరిపూటి రమణ అధికారులతో మాట్లాడుతూ రోడ్డు పనులు నాణ్యత తో చేయించాలి అన్నారు

## మహా కుంభమేళలో మచ్చా రామలింగారెడ్డి




ఉరవకొండ, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)


ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్ రాజ్ లోని త్రివేణి సంగమం నందు జరుగుతున్న మహా కుంభమేళలో ప్రత్యక్ష దైవం శిరిడి సాయి సినిమాలో షిరిడి సాయిబాబా పాత్రధారి మచ్చా రామలింగారెడ్డి త్రివేణి సంగంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానం చేశారు.

ప్రత్యక్ష దైవం శిరిడి సాయి సినిమా ఇటీవలనే సెన్సార్ పూర్తి చేసుకుని త్వరలో జనం ముందుకు సినిమా విడుదలకు సిద్ధమవుతోంది

144 సంవత్సరాలు తర్వాత మహా కుంభమేళ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డి కుటుంబ సమే-ఎతంగా ప్రయాగరాజ్ త్రివేణి సంగమం గంగానదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు కుంకుమ, పువ్వులు సమర్పించి హారతి ఇచ్చారు

## సీలింగ్ భూములు,అక్రమ ఇంటి పట్టాలు రద్దు పరచండి - అక్రమాలకు ఆనవాళ్లు రెవెన్యూ అధికారులు





ఉరవకొండ, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

ప్రభుత్వ అధికారుల బాధ్యతారాహిత్యంగా నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన సీలింగ్ భూములు అక్రమంగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గ్రామీణ సేవా సమితి అధ్యక్షులు మాలపాటి శ్రీనివాసులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ను విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మాలపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో సీలింగ్ భూముల పంపిణీలో అనేక అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయి. సీలింగ్ భూములు కేటాయించాలంటే నిరుపేద రైతు కూలీ అయి ఉండి తీరాలి. అలాగే స్థానికుడై ఉండాలి.

రెవెన్యూ అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా సర్వే నంబర్ 476 (డి )ఐదు లో ఒక ఎకరా ఆయకట్టు మాగాణి భూమిని ఉరవకొండ పట్టణానికి చెందిన దాశెట్టి రామాంజనేయులు కు కేటాయించారు. ఈయన రైతు కూలీ కాదు. స్థానికుడు అసలే కాదు. చేనేత కులస్తుడు. ఇది ఇలా ఉండగా( బి )ఆరుకు సంబంధించిన మరో ఎకరా భూమిని అనంతపురం పట్టణానికి చెందిన ఆజాద్ కు కేటాయించారు. ఇతను మహమ్మదీయుడు. స్థానికేతరుడు. రైతు కుటుంబానికి చెందని వ్యక్తి. పైగా ఓ విలేకరిగా పనిచేస్తున్నారు. బి 7 లో మరో ఎకరా భూమిని ఉరవకొండకు చెందిన గుగ్గిళ్ళ రంగనాయకులకు డి ఫారం పట్టా ఇచ్చారు. ఇతను చేనేత కుటుంబీకుడు. పైగా విలేఖరి గా ఉంటూ మృతి చెందారు..

పాల్తూరు గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం సీలింగ్ భూములు పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ భూములపై పాల్తూరు అనంత గ్రామీణ బ్యాంకుల్లో అప్పట్లో రుణాలు సైతం పొందారు. సీలింగ్ భూములకు బ్యాంకర్లు అడ్డగోలుగా రుణాలు మంజూరు చేశారు. రుణ వసూళ్లకు వెళితే తాము విలేకరులమంటూ బెదిరించడం జరిగింది.

ఇది ఇలా ఉంటే ఉరవకొండ పట్టణంలోని హమాలీ కాలనీలో541-2 సర్వే నంబర్లు డి రామాంజనేయులు ప్లాట్ నంబర్ 41 లో మూడు సెంట్లు పొందారు, 42లో రంగనాయకులు, 43 లో హీరే హాల్ అజాద్ మూడు సెంట్లు పొందగా, బిఎండి ఖాజా 44 లో మూడు సెంట్లు ఇళ్ల పట్టాలు పొందారు. స్థానికత, అర్హతలకు, త్రిలోదకాలు ఇచ్చి చట్ట వ్యతిరేకంగా మంజూరు చేయడమే కాకుండా ఇటీవల కొలిమి కాలనీలో డి రామాంజనేయులు అనే విలేఖరి తిరిగి రెండు సెంట్లు ఇంటి పట్టా పొందారు. మరికొందరు స్థానికేతరులు కాగా, వివాహం కాని విలేకరులు సైతం ఉన్నారు.

ప్రభుత్వ అధికారుల తప్పిదాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాల్సిన విలేకరులు కొందరు వృత్తిని అడ్డుపెట్టుకొని అడ్డగోలుగా సంపాదిస్తూ పత్రికలకు, వృత్తికి తీరని మాయని మచ్చ తెస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా ఉన్నాయి.

ఉరవకొండలో ఇళ్ళ పట్టాల మంజూరులో అనేక అవినీతి అక్రమాలు కోకొల్లలు జరిగాయి. ఇల్లు లేని నిరుపేదలకు మొండి చేయి చూపిస్తూ ఇల్లున్న వాడికి, బహుళ అంతస్తులున్న వారికే రెవెన్యూ అధికారులు అక్రమంగా మంజూరు చేశారు.

వీటిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు గ్రామీణ సేవా సమితి అధ్యక్షులు శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదును రెవెన్యూ అధికారులు నాన్పులుడు ధోరణి అవలంబిస్తున్నారని ధ్వజ మెత్తారు.. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని లేనిపక్షంలో అధికారులను ప్రతివాదులుగా చేర్చి లోకాయుక్తలో న్యాయ పోరాటానికి శ్రీకారం చుట్టినట్లు లోకాయుక్త ఫిర్యాదీదారుడు మాలపాటి శ్రీనివాసులు తెలిపారు

## చైనా లో ప్రారంభానికి ముందే రిజర్వేషన్ ఫీజు వసూళ్ళు -పుస్తకాలను డోర్ డెలివరీ చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు




ఉరవకొండ, ఫిబ్రవరి 21 (అనంత ప్రభ)

అనంతపురం శ్రీ చైతన్య,నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థలలో ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రేపు సంవత్సరం ఫీజు ఇప్పుడే రిజర్వేషన్ కట్టించుకుంటున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తోంది. విద్యా మాఫియా పై నిరోధించే దిశగా చర్యలు తీసుకోవటంలో డీఈఓ చోద్యం చూస్తున్నారు అంటూ నేతలు ధ్వజమెత్తారు. నీలం రాజశేఖర్ రెడ్డి భవనం నందు పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ జిల్లాలో శ్రీ చైతన్య నారాయణ భాష్యం కార్పొరేట్ విద్యాసంస్థలు యాజమాన్యులు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఇప్పటినుంచే రేపు సంవత్సరానికి సంబంధించి ఇప్పుడే విద్యార్థుల తల్లిదండ్రుల నుండి 5వేల రూపాయలు రిజర్వేషన్ డబ్బులు వసూలు చేస్తూ, పుస్తకాలు కొనుక్కోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు హుకుం జారీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రారంభ సమయానికి ఇంకా నాలుగైదు నెలలు గడువు ఉన్నప్పటికీ ఫిబ్రవరి మాసం నుంచే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ పుస్తకాలు కొనుగోలు చేయాలని కార్పొరేట్ విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను జొమాటో స్వీకి ఫ్లిప్కార్ట్ ఇలాంటి వాటిలో పుస్తకాలను ఇళ్లకు పంపిస్తామని కార్పొరేట్ విద్యాసంస్థలు ఒక మాఫియా లాగా చేస్తున్నారు.. పుస్తకాలు విద్యాసంస్థలలో అమ్మితే జిల్లా విద్యాశాఖ అధికారులు వాటిని పట్టుకొని విద్యాసంస్థలకు ఫైన్లు వేస్తూ రూపంలో సీజ్ చేస్తున్నారని ఇలా ఆన్లైన్ ద్వారా ఇళ్లకు పంపితే ఎవరు ఏమి చేయలేరని పద్ధతుల్లో కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు ఒక మాఫియాను అనంతపురంలో తెరలేపారు, జిల్లా డీఈవో గారు దీనిపైన స్పందించి తక్షణమే విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ప్రతి విద్యార్థితో రేపు సంవత్సరానికి సంబంధించి ఇప్పుడే రిజర్వేషన్ ఫీజు వసూలు చేస్తున్నారు.. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల యా-జమాన్యులు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న చిన్న చితక ఉద్యోగస్తులను ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రతి ఏరియాలలో కాలనీలలో మండల కేంద్రాలలో పట్టణ కేంద్రాలలో ఇంటింటికి తిరుగుతూ అడ్మిషన్లు ప్రారంభిస్తున్న జిల్లాలో ఉన్న ఎంఈఓ లు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. తక్షణమే ముందస్తు అడ్మిషన్లు ఆపాలని, రేపు విద్యా సంవత్సరం సంబంధించి రిజర్వేషన్ ఫీజు వసూలు చేస్తున్న విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని, పుస్తకాలు ఇప్పుడే కొనుగోలు చేస-్తున్న విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో గారు ఈ మూడు సంఘటనల పైన విచారణ జరిపించి తక్షణమే విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో డీఈఓ గారికి ముందస్తు రిజర్వేషన్ ఫీజు కట్టించుకున్న రిసిప్ట్ పుస్తకాలు కొనుగోలు చేసిన ఆధారాలు, ఆన్లైన్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్న పుస్తకాలతో సహా అందజేస్తామని తెలిపారు. ఇప్పటికైనా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లు రిజర్వేషన్ ఫీజులు పుస్తకాలు కొనుగోలు ఆపకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని ఈ సందర్భంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ జిల్లా కార్యవర్గ సభ్యులు వినోద్ కుమార్ నాయకులు పవన్ రోహిత్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు







## అధిక రక్తపోటును అదుపులో ఉంచాలా? పాలలో ఇది కలుపుకొని తాగండి



ప్రపంచంలో అధిక శాతం మంది హైపర్ టెన్షన్ లేదా హైబీపీతో బాధపడుతున్నట్టు అంచనా. చాలామందిలో హై బీపీ తీవ్ర స్థాయికి చేరుకునే వరకు పట్టించుకోరు. ఆ తర్వాత వైద్యుడు వద్దకు పరుగులు తీస్తారు. తలనొప్పి, జ్వరం, ఒళ్ళు నొప్పులు, దగ్గు వంటివి బీపీ పెరిగితే కనిపించే లక్షణాలు. ఒకప్పుడు వయసు పెరిగాక మాత్రమే హైబీపీ వచ్చేది. ఇప్పుడు 18 ఏళ్ల వయసు నుంచి కూడా హైపర్ టెన్షన్ లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ముగ్గురిల ఒకరికి హైబీపీ ఉంటున్నట్టు వైద్యుల అంచనా.

ఇది ఎందుకు వస్తుందో కచ్చితంగా చెప్పలేము. వంశపారంపర్యంగా కూడా హైపర్ టెన్షన్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆధునిక కాలంలో ఆరోగ్యకరమైన ఆహారం తినడం తగ్గించేసింది యువత. ప్రాసెస్డ్ ఫుడ్, పిజ్జాలు, బర్గర్లు, నిల్వచేసిన మాంసం, కూల్ డ్రింకులు, ఫ్రిజ్ లో ఎక్కువ కాలం నిల్వ చేసిన పదార్థాలు తినడం వల్ల కూడా హైబీపీ వస్తున్నట్లు అంచనా. ఉప్పు అధికంగా వాడడం వల్ల హై బీపీ త్వరగా వచ్చేస్తుంది. టెన్షన్ కూడా హైబీపీ వచ్చే అవకాశాన్ని పెంచుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ లో ఎక్కువగా తిరిగేవారు ఈ టెన్షన్ బారిన పడుతున్నారు.

ఆయుర్వేదం ప్రకారం అధిక రక్తపోటు వాత, పిత్త, కఫ అనే మూడు దోషాలలో అసమతుల్యత వల్ల వస్తుంది. శరీరంలో టాక్సిన్స్ చేరడం, చెడు జీవనశైలి, వ్యాయామం లేకుండా నిశ్చలంగా ఉండడం, జీవక్రియ సరిగా జరగకపోవడం వంటివి కూడా అధిక రక్తపోటుకు కారణాలు. అయితే ఆయుర్వేదంలో అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచే ఒక అద్భుత ఔషధం ఉంది.

ఇదొక్కటి చాలు

హైబీపీ బారిన పడినవారు దాన్ని అదుపులో ఉంచాలనుకుంటే ఆయుర్వేదం చిట్కాను సూచిస్తోంది. ప్రతిరోజు ఉదయం పాలలో రెండు మూడు గ్రాముల అర్జున బెరడు పొడిని కలుపుకొని తాగాలి. ఇది రక్తపోటును తగ్గించడమే కాదు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే శక్తివంతమైన ఔషధం.

దీన్ని ఎలా చేయాలంటే

ఈ పానీయాన్ని ఇంట్లో సులభంగా చేసుకోవచ్చు. ముందుగానే అర్జున చెట్టు బెరడు పొడిని కొని ఇంట్లో పెట్టుకోవాలి. ఒక కప్పు పాలను మరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు ఈ పొడిని వేయాలి. ఇలా రోజుకు రెండుసార్లు ఈ పాలను తాగడం వల్ల మార్పు మీకే కనిపిస్తుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. అలాగే తాజా ఆకుకూరలు, కూరగాయలు తింటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీని వల్ల రక్తపోటు పెరగదు. అర్జున చెట్టు ఎక్కడైనా కనిపిస్తే దాని బెరడు ఒలిచి ఎండబెట్టుకుని పొడి చేసి దాచుకోండి.

## భోజనం తర్వాత ఇలా చేయాలంటున్న ఆయుర్వేదం - శతపల్లి అంటే?

చురుగ్గా ఉండేందుకు కేవలం తినే భోజనం మాత్రమే కాదు, తిన్న తర్వాత చేసే పనుల మీద కూడా శ్రద్ధ పెట్టాలని ఆయుర్వేదం చెబుతోంది. మనదేశానికి చెందిన పురాతనమైన శతపల్లి అనే ఒక కాన్సెప్ట్ ఉంది. దీని ప్రకారం భోంచేశాక షికారుకు వెళ్లమని చెబుతున్నారు. అలాగే భోజనం తర్వాత 100 అడుగులు నడవాలనే సూచన కూడా ఉంది. దీనిని షట్పావళి అంటారు. నితికా కోహ్లీ అనే ఆయుర్వేద డాక్టర్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా దీనిపై పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.



పూర్వకాలం నుంచి జీర్ణక్రియకు తోడ్పడే మంచి అలవాటుగా షట్పావళి రుజువైంది. భోజనం చేసిన తర్వాత 100 అడుగుల దూరం నడవడం జీర్ణవ్యవస్థకు చక్కని అలవాటుగా పరిణమిస్తుందని నితికా కోహ్లీ అంటున్నారు. వాకింగ్ లేదా జాగింగ్ శరీరాన్ని ఫిట్ గా ఉంచే మంచి వ్యాయామంగా నిపుణులు చెబుతున్నారు. కేవలం ఫిట్ గా ఉండడం బరువు అదుపులో పెట్టుకోవడం మాత్రమే కాదు ఇది జీర్ణవ్యవస్థను కూడా క్రమశిక్షణలో ఉంచుతుంది. భోజనం తర్వాత వంద అడుగులు నడవడం వల్ల కలిగే లాభాల గురించి మరో ఆయుర్వేద నిపుణులు డాక్టర్ శ్రీవాస్తవ వివరించారు

జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది.

భోజనం తర్వాత నడిస్తే ఎక్కువ కాలరీలను బర్న్ చెయ్యడం సాధ్యమవుతుంది.

రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.

ట్రైగ్లిజరాయిడ్ల నియంత్రణకు తోడ్పడుతుంది.

తీసుకున్న ఆహారంలోని పోషకాలు కూడా త్వరగా శరీరానికి అందుతాయి.

డయాబెటిస్‌తో బాధపడుతున్నవారు భోజనం తర్వాత చిన్నగా నడిస్తే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉన్నట్టు స్పోర్ట్స్ మెడిసిన్ అనే జర్నల్ లో పేర్కొన్నారు. ఆయుర్వేదంలో సూచించిన ఈ పురాతన చిట్కా శట్పావళి చాలా ప్రయోజనకర ప్రక్రియ. భోజనం తర్వాత నిద్రపోయే అలవాటు ఉంటుంది చాలా మందిలో. అది శరీరంలో కఫం, కొవ్వు పెరగడానికి కారణం అవుతుంది. అంతేకాదు జీర్ణక్రియ కూడా నెమ్మదిస్తుంది. భోజనం తర్వాత వెంటనే నీళ్లు తాగడం కూడా జర్ణక్రియ నెమ్మదించడానికి కారణం కావచ్చని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అంతేకాదు ఈ అలవాటు బరువు పెరగడానికి కూడా కారణం అవుతుందట. భోజన సమయంలో లేదా భోజనం తర్వాత వెంటనే నీళ్లు తాగకూడదు. రెండు భోజనాల విరామ సమయంలోనే నీళ్లు తాగడం మంచిదనేది నిపుణుల సూచన.

## శెనగపిండి కోవా, చూస్తేనే నోరూరిపోతుంది

శెనగపిండి అనగానే అందరికీ గుర్తొచ్చేవి పకోడీలే, బజ్జీలే. కానీ వీటితో తీయటి కోవాలు కూడా తయారు చేయచ్చు. కోవాల పేరు చెబితేనే నోరూరిపోతుంది చాలా మందికి. పాలను విరగ్గొట్టి చేసే కోవాలే అధికంగా తింటూ ఉంటారు. ఈసారి శెనగపిండితో వండి చూడండి, చాలా టేస్టీగా ఉంటాయి. ఒక్కసారి తింటే మళ్లీ మళ్లీ తినాలపిస్తుంది. నోరూరిపోవడం ఖాయం.



కావాల్సిన పదార్థాలు

శెనగపిండి - ఒక కప్పు
పాల పొడి - పావు కప్పు
నెయ్యి - అర కప్పు
కొబ్బరి తురుము - అర కప్పు
పంచదార పొడి - ముప్పావు కప్పు
పాలు - ఒక కప్పు

తయారీ ఇలా

1. ముందుగా స్టవ్ మీద కళాయి పెట్టి అర స్పూను నెయ్యి వేయాలి. అందులో శెనగపిండి వేసి వేయించాలి.
2. అవి కొంచెం రంగు మారాక మరికొంచెం నెయ్యి వేసి కలపాలి. రెండు మూడు నిమిషాలు వేయించాలి.
3. అందులో పాల పొడి, కొబ్బరి తురుము వేసి వేయించాలి.
4. అన్నింటినీ బాగా కలిసేలా గరిటెతో కలపాలి.
5. రెండు నిమిషాలు తరువాత పాలు వేసి బాగా కలపాలి.
6. రెండు మూడు నిమిషాలు వేయిస్తే కళాయి అడుగు నుంచి మిశ్రమం వదిలి అంతా కలిపి ఓ ముద్దలా మారుతుంది.
7. ఇప్పుడు పంచదార పొడి వేసి కలపాలి.
8. పంచదార కరిగి ఆ మిశ్రమంలో కలుస్తుంది. రెండు మూడు స్పూన్ల నెయ్యి కూడా వేసి కలపాలి.
9. మిశ్రమం దగ్గరగా కోవాలా అయ్యే వరకు ఉంచి మంటను కట్టేయాలి.
10. మిశ్రమం కాస్త చల్లారాక చేతికి నెయ్యి రాసుకుని కోవాలా ఒత్తుకోవాలి.
11. మీకు కావాలనుకుంటే నట్స్ ను కూడా కలుపుకోవచ్చు. కోవాపై ఒక బాదం పప్పునో, జీడిపప్పునో పెట్టుకోవచ్చు.

శెనగపిండి ఉపయోగాలు...

శెనగపిండితో చేసే వంటకాలు అధికంగా పకోడీలు, బజ్జీలు, మోతిచూర్, బేసన్ లడ్డూలే. కానీ కోవా కూడా చేయొచ్చని తెలుసా? ఇది చాలా టేస్టుగా ఉంటుంది. శెనగపిండి మితంగా తింటే చాలా మంచిది కూడా. ఒక శెనగపిండి ద్వారా 356 కేలరీల శక్తి అందుతుంది. ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్ బి6, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్ కూడా అందుతుంది. అన్నట్టు ఇది గ్లూటెన్ ఫ్రీ కూడా. కాబట్టి గోధుమల కన్నా మంచిదనే చెప్పుకోవాలి. దీని గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ కూడా తక్కువ. కాబట్టి డయాబెటిక్ రోగులకు కూడా మేలే జరుగుతుంది. ఇందులో ఉండే పీచు పదార్థాలు గుండెకు ఎంతో మేలు చేస్తుంది. శెనగపిండితో చేసిన వంటకాలు తినడం వల్ల బరువు కూడా పెరగరు. అలెర్జీలు కూడా రావు. ఏవైనా అలెర్జీలు ఉన్న వారు శెనగపిండి తో చేసే వంటకాలు తినడం వల్ల వారికి ఆ లక్షణాలు తగ్గుతాయి. రక్తహీనత ఉన్న వారికి శెనగపిండి మంచి ఎంపిక. ఇది రక్తహీనత సమస్యను తగ్గిస్తుంది. రక్తపోటును నివారిస్తుంది. ఇది ఎదిగే పిల్లలకు చాలా అవసరం. దీనిలో గ్రోత్ హార్మోన్లు అధికం.

## టేస్టీ టమాటో పులావ్, పిల్లలకు బెస్ట్ ఫుడ్

టమోటాలతో సింపుల్ గా చేసే వంటకాలలో టమోటా పులావ్ ఒకటి. దీని రుచి అదిరిపోతుంది. పిల్లలకు ఇది బెస్ట్ ఫుడ్ అని చెప్పుకోవచ్చు. లంచ్ బాక్సుకు ఇది మంచి రెసిపీ. పిల్లలు, పెద్దలు ఇద్దరికీ మంచి ఫుడ్ ఇది. వండడం కూడా చాలా సులువు. అరగంటలో ఇది రెడీ అయిపోతుంది. దీన్ని తింటే ఫుల్ మీల్స్ తిన్నట్టే ఉంటుంది. అది కూడా వేడివేడిగా తింటే ఆ రుచే వేరు

కావాల్సిన పదార్థాలు, బాస్మతి బియ్యం - రెండు కప్పులు
టమోటా ముక్కలు - ఒక కప్పు,ఉల్లిపాయ - ఒకటి
నెయ్యి - రెండు స్పూనులు, కారం - ఒక స్పూను
పసుపు - అర స్పూను, ఉప్పు - రుచికి సరిపడా
కొత్తిమీర తరుగు - నాలుగు స్పూన్లు, నూనె - నాలుగు స్పూన్లు
కరివేపాకులు - గుప్పెడు, జీడిపప్పులు - ఎనిమిది
అల్లం తరుగు - ఒక స్పూను, వెల్లుల్లి తరుగు - ఒక స్పూను
పచ్చిమిర్చి - రెండు, గరం మసాలా - ఒక స్పూను

తయారీ ఇలా

1. బియ్యం బాగా కడిగి పొడిగా వచ్చేలా అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. కాస్త నూనె వేసి వండితే అన్నం పొడిగా వస్తుంది.

2. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. ఉల్లిపాయ తరుగు, పచ్చిమిర్చి, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు వేసి వేయించాలి.

3. టమాటో ముక్కలు వేసి కలపాలి. మూత పెడితే టమాటోలు బాగా మగ్గుతాయి.

4. పసుపు, ఉప్పు, కారం వేసి బాగా కలపాలి. అన్ని ఉడికాక గరం మసాలా పొడి వేయాలి.

5. అందులో ఒక స్పూను నెయ్యి కూడా వేస్తే మంచి టేస్టు వేస్తుంది.

6. అందులో వేయించిన జీడిపప్పులు, కొత్తిమీర తరుగు కూడా వేసి కలపాలి.

7. ఇప్పుడు ఉప్పు కూడా వేసి బాగా కలపాలి.

8. స్టవ్ కట్టేసి అందులో ఉడికిన అన్నాన్ని వేసి కలపాలి. కలిపేటప్పుడు ముద్దయ్యేలా కాకుండా పొడిపొడిగా కలపాలి.

9. అంతే టమోటా పులావ్ రెడీ అయినట్టే.

టమోటా ప్రయోజనాలు...

1. టమోటాలు చర్మం, జుట్టుకు ఎంతో మంచివి. ఇందులో ఉండే లైకోపీన్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది క్యాన్సర్ రాకుండా అడ్డుకుంటుంది.
2. మధుమేహులు టమోటాలను తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. ఇందులో ఉండే క్రోమియం ఉండడం వల్ల చక్కెర స్థాయిలు తగ్గుతాయి.
3. ఇవి మీ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇందులో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది ఒత్తిడి హార్మోన్లను నియంత్రిస్తుంది.
4. ఇందులో ఉండే లైకోపీన్ ప్రొస్టేట్, పొట్ట, కొలొరెక్టల్ క్యాన్సర్ వంటివి రాకుండా అడ్డుకుంటుంది. క్యాన్సర్ కణాల పెరుగుదలను ఇది అడ్డుకుంటుంది.



AP 4PG 22 02 2025 SATURDAYqxp_Layout 1 21-02-2025 10:21 PM Page 4



# చిక్కుల్లో సమంత ప్రాజెక్ట్.. కోట్ల రూపాయలు పక్కదారి!



స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన కెరీర్ పైనే ఫుల్ ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. నాగచైతన్యతో విడిపోయిన తర్వాత పూర్తిగా ఫిల్మ్స్ పైనే దృష్టి సారించింది. కానీ అనుకోకుండా ఆమె ఆరోగ్యం దెబ్బతిని కాస్తా బ్రేక్ పడింది. మయోసైటిస్ వ్యాధితో సమంత దాదాపు రెండేళ్ల పాటు ఇబ్బంది పడింది. నరాల బలహీనత గల ఆ వ్యాధి కారణంగా ఏకంగా ఏడాది సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. ఆమె త్వరగా కోలుకోవాలని అభిమానులు, శ్రేయోభిలాషులు ఎంతగానో కోరుకున్నారు. అందరి ప్రార్థనల మేరకు సమంత కోలుకుంది. ఇక కొద్ది నెలల నుంచి మంచి తన ప్రాజెక్ట్స్ ల్లో బిజీగా కనిపిస్తోంది.

తెలుగు చివరిగా సమంత రెండేళ్ల కింద 'శాకుంతలం', 'ఖుషి' చిత్రాలతో తెలుగు ఆడియెన్స్ ను అలరించింది. ఆ తర్వాత నుంచి తెలుగులో ఒక్క సినిమాకు కూడా సైన్ చేయలేదు. రీసెంట్ 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ప్రకటించినా సాలిడ్ అప్డేట్ అయితే రాలేదు. దీంతో సామ్ బాలీవుడ్ లోనే ఫుల్ బిజీ అవుతోంది. 'ది ఫ్యామిలీ మెన్' సిరీస్ నుంచి అక్కడే సామ్ ఎక్కువగా సినిమాలపై ఆసక్తి చూపిస్తోంది. ఈ క్రమంలోనే అమెజాన్ ప్రైమ్ నిర్మించిన క్రేజీ సిరీస్ 'సిటాడెల్ : హనీ బన్నీ'తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. మొదటి సీజన్ హిట్ అవ్వడంతో రెండో సీజన్ కోసం ఆడియెన్స్ ఎదురుచూస్తున్నారు.

ఇదిలా ఉంటే... సామ్ చేతిలో ఉన్న ఓ ప్రాజెక్ట్ చిక్కుల్లో పడటం షాక్ కు గురిచేసింది. ఆమె నటిస్తున్న మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ 'రక్త్ : బ్రమండ్'. సమంత డ్రీమ్ ప్రాజెక్ట్ ఇది. ఈ సిరీస్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నెట్ ఫ్లిక్స్ లాంటి పెద్ద సంస్థ ఈ సిరీస్ ను నిర్మిస్తుండటం విశేషం. దర్శకుడు రహి అనిల్ బర్వే తెరకెక్కిస్తున్నారు. ఆదిత్య రాయ్ కపూర్, నటి వామికా గబ్బి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొన్నటి వరకు ఈ సిరీస్ షూటింగ్ సాఫీగానే సాగింది. కానీ బడ్జెట్ లో దోపిడీ జరుగుతుందనే నెపంతో షూటింగ్ ను తాత్కాలికంగా నిలిపివేశారంట. కొంతమాత్రం షూటింగ్ కే సగానికిపైగా బడ్జెట్ ఖర్చై అవ్వడమే దానికి కారణమంటున్నారు.

రక్త్ : బ్రమండ్... నిర్మిస్తున్నవారిలో ఒక ప్రొడ్యూసర్ దుర్బుతితో కోట్ల రూపాయాలను పక్కదారి పట్టిస్తున్నారంట. టీమ్ ఆయన్ని విచారణ చేసి, ఆ తర్వాత షూటింగ్ మొదలు పెట్టనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఈ సిరీస్ కేవలం 26రోజులు మాత్రమే షూటింగ్ జరుపుకుంది. అంతలోనే కోట్ల రూపాయాల స్కామ్ అంటూ ప్రాజెక్ట్ కు బ్రేక్ పడిందని తెలుస్తోంది.

మరోవైపు సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో తన ఫ్యాన్స్ కు నిత్యం అందుబాటులోనే ఉంటోంది. వరుసగా పోస్ట్ లు పెడుతూ వస్తోంది. వాటితోనూ సమంత రెండో పెళ్లికి సిద్ధమవుతుంది అంటూ పుకార్లు గుప్పుమంటున్నాయి. ఇటీవల నాగచైతన్య – శోభితా కలిసి ఎక్కువ కనిపించడం.. సమంత పెట్టిన పోస్టులు రిలేటెడ్ గా ఉన్నాయంటూ మొన్నటి వరకు సోషల్ మీడియాలో రచ్చ జరిగిన విషయం తెలిసిందే. ఇక సమంత మాత్రం ప్రస్తుతం తన ప్రాజెక్ట్స్ తోనే బిజీగా ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యురిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# రాజమౌళి ఆఫర్‌ను రిజెక్ట్ చేసిన స్టార్ హీరోయిన్.. ఆ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే కెరీర్ మరోలా



దర్శక ధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన ఘనుడు. ఒకప్పుడు తెలుగు సినిమాలు కేవలం సౌత్ వరకే పరిమితం అయ్యేవి. కానీ, రాజమౌళి ఎంట్రీతో తెలుగు సినిమా ఖ్యాతి ఏకంగా పాన్ వరల్డ్ వరకు చేరింది. రాజమౌళి డిక్షనరీలో 'ఫెయిల్యూర్' అనే పదమే లేదంటే అతిశయోక్తి కాదు. ఆయన డైరెక్షన్ లో ఒక్క సినిమాలోనైనా నటించాలని, స్టార్ హీరోయిన్ హీరోలు సైతం సంవత్సరాలకు అది వెయిట్ చేస్తూ ఉంటారు. అలాంటి దర్శక ధీరుడు రాజమౌళి ఒక క్రేజీ ఆఫర్ ఇస్తే .. ఓ స్టార్ హీరోయిన్ ఆఫర్ ను తిరస్కరించిందట. ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరు? ఆఫర్లు రిజెక్ట్ చేయడానికి గల కారణం ఏంటి?

దర్శక ధీరుడు రాజమౌళి.. ఆయన గురించి ఎంత చెప్పినా ఎంత మాట్లాడినా తక్కువే. ఆయన తెలుగు చలనచిత్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. ఆయన స్టార్ హీరోలనే కాకుండా కమెడియన్లను, చివరికి 'ఈగ 'లాంటి యానిమేషన్ పాత్రలతో కూడా సక్సెస్ అందుకోగల ఘనుడు రాజమౌళి. ఆయన కెరీర్ వరుస హిట్లతో కొనసాగుతోంది. ఆయన దరక్షకత్వం వహించిన ఒక్క సినిమాలోనైనా నటించారని స్టార్ హీరోలు సైతం సంవత్సరాలకు వేచి ఉంటారు. ఆయనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సాధించారు. తన కెరీర్లో ఇప్పటివరకు ఫెయిల్యూర్ ఎరగని దర్శకుడుగా రికార్డు క్రియేట్ చేశారు.

ఆయన రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన మగధీర, బాహుబలి 1, బాహుబలి 2 సినిమాలు ఇలాంటి రికార్డులను క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. బాక్సాఫీస్ వద్ద ఆయన సినిమాలు కలెక్షన్ల సునామీని సృష్టించి నయా రికార్డులను క్రియేట్ చేశాయనడంతో ఎలాంటి అతిశయోక్తి లేదు. అలాంటి క్రేజీ అండ్ సక్సెస్ఫుల్ డైరెక్టర్ రాజమౌళి ఆఫర్ ఇస్తే ఓ స్టార్ హీరోయిన్ రిజెక్ట్ చేసిందట. ఆ హీరోయిన్ ఎవరో కాదు టాలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష. దక్షిణాది సినిమాలలో నటించిన ఈ అమ్మడు.. జక్కన్న ఆపరిస్తే రిజెక్ట్ చేసిందట.

వివరాల్లోకి వెళితే రాజమౌళి 2009లో మగధీర సినిమాతో ఫుల్ ఫామ్ లోకి వచ్చారు. అనంతరం 2010లో కమెడియన్ సునీల్ ను హీరోగా పెట్టి మర్యాద రామన్న అనే సినిమాను తెరకెక్కించారు. అయితే ఈ సినిమాలో హీరోయిన్గా ముందుగా స్టార్ హీరోయిన్ త్రిష ను హీరోయిన్ సెలెక్ట్ చేశారంట. ఆమని ఊహించుకొని కథను డిజైన్ చేయించారంట. కానీ జక్కన్న ఇచ్చిన ఆ క్రేజీ ఆఫర్ ను నటి త్రిష తిరస్కరించిందట. వాస్తవానికి ఆ ఆ సమయంలో త్రిష సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్గా రాణిస్తుంది. ఆ సమయంలో తాను కమెడియన్ పక్కన హీరోయిన్ గా నటిస్తే.. తన కెరీర్ కు అలాగే తన ఇమేజ్ డ్యామేజ్ అవుతుందని భావించిందట. ఈ మేరకు రాజమౌళి సినిమాను రిజెక్ట్ చేసిందట. దీంతో త్రిష ప్లేస్ లో సలోని హీరోయిన్ గా తీసుకున్నట్లు సమాచారం.

# ఛావా ఫస్ట్ రివ్యూ.. రష్మిక మందన్న ఫెర్ఫార్మెన్స్ ఎలా ఉందంటే?

నేషనల్ క్రష్ రష్మిక మందన్న, మోస్ట్ టాలెంటెడ్ హీరో వికీ కౌశల్ జంటగా రూపొందిన చిత్రం ఛావా. మరాఠా కింగ్ చత్రపతి సంభాజీ మహారాజ్ జీవితంలో జరిగిన కీలక సంఘటనల ఆధారంగా రూపొంది ఈ సినిమాకు లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఫిబ్రవరి 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్నది. ఈ క్రమంలో ఈ సినిమాపై ప్రముఖ క్రిటిక్ తనదైన శైలిలో రివ్యూ అందించారు. ఈ సినిమాపై సినీ విమర్శకుడు విశ్లేషణ ఏందనే వివరాల్లోకి వెళితే..

ఛావా సినిమా విషయానికి వస్తే.. శివాజీ సావంత్ రచించిన మరాఠీ నవల ఛావా ఆధారంగా తెరకెక్కింది. ఈ సినిమాను దినేష్ విజన్ నిర్మాణ సారథ్యంలో మడోక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ మూవీకి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో ఛత్రపతి సంభాజీ మహారాజ్‌గా వికీ కౌశల్, మహరాణి యేసుభాయ్‌గా రష్మిక మందన్న, ఔరంగజేబ్‌గా అక్షయ్ కుమార్,అశుతోష్ రాణా, దివ్య దత్తా, దయాన పెంటీ తదితరులు నటిస్తున్నారు.

చారిత్రాత్మక నేపథ్యంగా రూపొందిన ఛావా సినిమాను అత్యంత భారీగా నిర్మించారు. భారీ సెట్స్, పురాతన కాలం క్యాస్ట్యూమ్స్‌ను డిజైన్ చేశారు. అలాగే టాప్ యాక్టర్లు, టెక్నీషియన్స్ పనిచేశారు. అలాగే దేశవ్యాప్తంగా ఈ సినిమాను క్రేజీగా ప్రమోట్ చేశారు. దాంతో ఈ సినిమా బడ్జెట్ భారీగా పెరిగిపోయింది. ఈ సినిమాను సుమారుగా 130 కోట్ల రూపాయలతో నిర్మించినట్టు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.

ఛావా చిత్రాన్ని దుబాయ్‌కు చెందిన క్రిటిక్ ఉమేర్ సంధూ సెన్సార్ ప్రీమియర్‌ను చూసి తన రివ్యూను అందించారు. రష్మిక నటించిన ఈ సినిమా యావరేజ్‌గా కూడా లేదు అని షాకింగ్ కామెంట్ చేశాడు. ఈ మూవీ చాలా లౌడ్‌గా, ఇరిటేటింగ్‌గా ఉంది అని కామెంట్ చేశాడు. ఇంకా ఈ సినిమా అంతగా ఆకట్టుకొనేలా ఉండదనే విధంగా ట్వీట్లు చేస్తున్నాడు.

ఛావా సినిమాలో వికీ కౌశల్ పెర్ఫార్మెన్స్ డిజాస్టర్. రాజుల వేషంతో బాగా కనిపించడం లేదు. రష్మిక మందన్న ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్. హిస్టారికల్ స్క్రిప్టులో బూతులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. చరిత్రను వక్రీకరించి సినిమాను రూపొందించారు. ఓవరాల్‌గా ఈ సినిమా యావరేజ్‌గా కూడా లేదు. వీఎఫ్ఎక్స్ వర్క్ నాసిరకంగా ఉంది అంటూ ఉమేర్ సంధూ తనదైన శైలిలో తన రివ్యూను పోస్టు చేశారు.

అయితే ఉమేర్ సంధూ ఇచ్చే రివ్యూలు అంచనాలకు దూరంగా ఉంటాయి. ఎక్కువగా కొందరిని టార్గెట్ చేసి రివ్యూ ఇస్తారనే వాదన సోషల్ మీడియాలో ఉంది. ఈ క్రమంలో ఛావాపై ఆయన ఇచ్చిన రివ్యూను జాగ్రత్తగా పరిశీలస్తున్నారు. ఈ మూవీ ఎలా ఉంటుందనేది సినిమా రిలీజ్ తర్వాతే తెలుస్తుంది. థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ ఉన్న సినిమా అనే ఫీలింగ్‌ను ట్రైలర్లు, ప్రమోషనల్ కాంటెంట్ ద్వారా స్పష్టమైంది.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com